ఎయిర్‌పోర్ట్‌లో చుట్టుముట్టి తాకారు: నటి అనుపమ పరమేశ్వరన్ ఆవేదన

5

ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

అక్టోబర్ 25 ఆదివారం 2026 | సంపుటి : 1 | సంచిక : 16 | పేజీలు : 6 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

SUNDAY OCTOBER 25 2026 | VOL:1 | ISSUE: 16 | PAGES:6 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM

దామరచర్లలో గుంజకు కట్టి కొట్టినా తప్పులేదు: కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు

- యాద్రి ప్లాంట్‌తో లక్ష కోట్ల అవినీతికి కేసీఆర్ ప్లాన్ చేశారని ఆరోపణ
- విదేశీ బొగ్గు కోసమే దూరంగా ప్లాంట్ నిర్మాణం
- క్షుద్రపూజలు చేసేవాళ్లు నీతులు చెబుతున్నారంటూ హరీశ్‌పై విమర్శలు
- కేసీఆర్ కుటుంబం ఏ వ్యాపారాన్నీ వదల్లేదని ఆరోపణ



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై, ఆయన కుటుంబంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని అడ్డం పెట్టుకుని రూ. లక్ష కోట్ల భారీ అవినీతికి కేసీఆర్ డిజైన్ చేశారని సంచలన ఆరోపణలు చేశారు. ఈ కుంభకోణానికి సూత్రధారి ప్రతిమా శ్రీనివాస్ అని ఆరోపించారు.ప్రపంచంలో ఎక్కడైనా ముడిసరుకు లభించే ప్రాంతంలోనే పరిశ్రమలు స్థాపిస్తారని, కానీ కేసీఆర్ ప్రభుత్వం బొగ్గు లభించే చోట కాకుండా కృష్ణా నదీ పరీవాహక ప్రాంతమైన దామరచర్లలో యాదాద్రి ప్లాంట్‌ను నిర్మించిందని విమర్శించారు. దీనివల్ల రూ.28 వేల కోట్లతో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు వ్యయం రూ.37,800 కోట్లకు పెరిగిందని, అంటే అదనంగా రూ.9,800 కోట్లు భారం పడిందని వివరించారు.40 ఏళ్లలో రూ. లక్ష కోట్ల అవినీతి కోసమే ఈ ప్లాంట్‌ను కేసీఆర్ డిజైన్ చేశారని రేవంత్ ఆరోపించారు. ఈ ప్రాజెక్టును గ్రేడ్-9 బొగ్గుతో నడిచేలా రూపొందించి, ఏటా 14 మిలియన్ టన్నుల బొగ్గును విదేశాల నుంచి దిగుమతి చేసుకునేలా ప్రణాళిక వేశారని మండిపడ్డారు. ఇంత పెద్ద అవినీతికి పాల్పడిన కేసీఆర్‌ను, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని దామరచర్లలో గుంజకు కట్టేసి కొట్టినా తప్పులేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చాకే ఒడిస్సాలోని నైనీ గని నుంచి బొగ్గు తెచ్చి రైతులకు విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ నేత హరీశ్‌రావుపై కూడా రేవంత్ ఘాటుగా స్పందించారు. "క్షుద్రపూజలు చేసేవాళ్లు కూడా నీతులు చెబితే తెలంగాణ ప్రజలు ఎలా నమ్ముతారు? మంత్రగాళ్లు, నేరగాళ్లను నమ్మాల్సిన పని లేదు" అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ కుటుంబం ఇసుక, బొగ్గు, భూములు, డ్రగ్స్, గంజాయి, కొకైన్ ఇలా దేన్నీ వదల్లేదని ఆరోపించారు. ఆంధ్రాలోని కాలేజీలు, ఆసుపత్రులకు పాలు సరఫరా చేసే వ్యాపారం హరీశ్‌రావు చూసుకుంటే, విదేశీ విస్కీ వ్యాపారాన్ని సంతోష్ రావు ఏర్పాటు చేసుకున్నారని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో 'టానిక్' పేరుతో ప్రత్యేక పర్మిషన్‌తో వ్యాపారం నడుపుతున్నారని, దేశంలో ఇలాంటి అనుమతి ఉన్నది అదొక్కటేనని రేవంత్ రెడ్డి విమర్శించారు.

'ఇండియా' కూటమి ర్యాలీ వద్దు.. రూ. 10,000 కోట్ల నష్టం వస్తుంది!: రాహుల్ గాంధీకి వ్యాపారుల విజ్ఞప్తి

- నవంబర్ 1న ఢిల్లీలో 'ఇండియా' కూటమి ర్యాలీ
- వాయిదా వేయాలని వ్యాపారుల విజ్ఞప్తి
- దీపావళి సీజన్‌లో రూ.10,000 కోట్ల వ్యాపారం నష్టపోతామని వర్తక సంఘం ఆందోళన
- రామ్‌లీలా మైదానం పరిసరాల్లోని 20 మార్కెట్లపై ర్యాలీ ప్రభావం చూపుతుందని వెల్లడిగత నెలలో జరిగిన ర్యాలీల వల్ల రూ. 3,000 కోట్లు నష్టపోయామని ఆవేదన
- నిరసన తెలిపే హక్కు ఉన్నప్పటికీ, పండగ తర్వాత ర్యాలీ నిర్వహించాలని కోరిక

ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నవంబర్ 1న 'ఇండియా' కూటమి నిర్వహించ తలపెట్టిన భారీ ర్యాలీని వాయిదా వేయాలని వ్యాపార వర్గాలు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని కోరాయి. దీపావళి పండగ సీజన్‌లో ఈ ర్యాలీ నిర్వహిస్తే సుమారు రూ.10,000

(మిగతా 2వ పేజీలో..)



వస్తోంది తుపాను కాదు.. అతి తీవ్ర తుపాను.. ఏపీకి ఐఎండీ హెచ్చరిక


బంగాళాఖాతంలో వాయుగుండం.. అతి తీవ్ర తుపానుగా మారే సూచన

అక్టోబర్ 28న ఏపీ తీరాన్ని తాకవచ్చని అంచనా

బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం

తీరం దాటే సమయంలో గంటకు 115-125 కి.మీ వేగంతో గాలులు

(మిగతా 2వ పేజీలో..)





ఒడిశాకు తుఫాన్ సూచన.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏర్పాటన వాయిదా

భువనేశ్వర్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల పాటు ఒడిశాలో పర్యటించాల్సి ఉన్నది. అయితే ఆ

రాష్ట్రంలోని తీర ప్రాంతాల్లో తుఫాన్ ఏర్పడే అవకాశమున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన వాయిదా పడింది. (గ్రాతీవంఱనవత్ ణతీశీబజ్ఘుఁనఱ వీబతీఎబ) అక్టోబర్ 28 నుంచి ప్రారంభం కావాల్సిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఒడిశా పర్యటన వాయిదా పడినట్లు అధికారులు తెలిపారు. 'ప్రతికూల

(మిగతా 2వ పేజీలో..)

సూపర్ ఎల్‌నినో ముప్పు.. నీటిని పొదుపు చేయండి!

- తాగునీటి అవసరాలకే చెరువుల నీటిని వినియోగించాలి
- రాష్ట్రంలో 20,018 మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్
- 15 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు భూగర్భజలాల కొరత
- ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపు
- వాతావరణ మార్పులతో తీవ్ర పరిణామాలు



ఖమ్మం, అక్టోబరు 24: సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి నీటి వనరులు ఎండిపోయే ప్రమాదం ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణ మార్పుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే తాగునీటి కొరత కూడా తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం కొదుమూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాగునీటికి ప్రాధాన్యమివ్వాలి చెరువులు, ఇతర నీటి వనరుల్లో అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని భట్టి విక్రమార్క సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో చెరువుల నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాలకే వినియోగించాలని కోరారు. పశువులు, ఇతర జీవరాశులకు నీటి కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆహార పదార్థాల

(మిగతా 2వ పేజీలో..)



కేంద్ర నిధులపై తెలంగాణ సర్కార్ ఫోకస్: అధికారులకు సీఎస్ సంజయ్ జాజు కీలక ఆదేశాలు

- కేంద్ర ప్రాయోజిత పథకాలపై సీఎస్ సంజయ్ జాజు సమీక్ష
- నిధుల రికవరీ, వినియోగం వేగవంతం చేయాలని ఆదేశం
- కేంద్ర అధికారులతో సమన్వయం పెంచుకోవాలని సూచన
- అవసరమైతే కేంద్ర కార్యదర్శులతో తానే చర్చిస్తానని వెల్లడి
- హైదరాబాద్ సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశం

కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రాష్ట్రానికి అందాల్సిన నిధులను సత్వరమే రాబట్టి, వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. నిధుల విడుదలలో జాప్యాన్ని నివారించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును, నిధుల వినియోగాన్ని సీఎస్ సమీక్షించారు. లభ్యతలో ఉన్న నిధులను

(మిగతా 2వ పేజీలో..)



జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు.. త్వరలో కార్యాచరణ!

- సొంతింటి కల సాకారం చేస్తాం.. న్యాయపరమైన చిక్కులు లేని కేటాయింపులు
- నివాసయోగ్యమైన ప్రాంతాల్లో స్థలాలు ఇచ్చేందుకు ప్రణాళిక
- జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీపై సమీక్షిస్తున్నాం: మంత్రి పొంగులేటి
- జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యకు శాశ్వత పరిష్కారం

హైదరాబాద్, అక్టోబరు 24: తెలంగాణలో జర్నలిస్టుల

(మిగతా 2వ పేజీలో..)

కాళేశ్వరంపై బీఆర్ఎస్ నేతలవి హేతుబద్ధత లేని విమర్శలు!

కేటీఆర్, హరీశ్‌రావుపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ధ్వజం

బ్యారేజీల మరమ్మతులు పూర్తయ్యే వరకు గేట్లు దించలేం

కాళేశ్వరం నిర్మాణమే తప్పుడు నిర్ణయం.. ప్రాణహిత--చేవెళ్లతో ఎక్కువ ప్రయోజనం

(మిగతా 2వ పేజీలో..)



కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా.. మహారాష్ట్రకు సీఎం రేవంత్ రెడ్డి



- సోమవారం జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా
- తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు బోర్డు నిర్ణయం
- సీఎం రేవంత్ రెడ్డి ముంబై పర్యటన కారణంగా అధికారులు హాజరుకాలేరని వెల్లడి
- మంగళవారానికి సమావేశాన్ని తిరిగి షెడ్యూల్ చేసిన కేఆర్ఎంబీ

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల పంపిణీపై చర్చించేందుకు సోమవారం (అక్టోబర్ 26) జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) 21వ సమావేశం వాయిదా పడింది. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఈ భేటీని మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు బోర్డు ప్రకటించింది.

(మిగతా 2వ పేజీలో..)

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా.. మహారాష్ట్రకు సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ముంబై పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరు కాలేరని తెలంగాణ ఇంజనీర్-ఇన్-చీఫ్ కేఆర్ఎంబీకి లేఖ ద్వారా తెలియజేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు సంబంధించిన కీలక చర్చల నిమిత్తం ముఖ్యమంత్రి మహారాష్ట్రకు వెళుతున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ కారణం చేత సమావేశాన్ని వాయిదా వేయాలని కోరారు.తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న కేఆర్ఎంబీ, సమావేశాన్ని మంగళవారానికి రీషెడ్యూల్ చేసింది. ఈ మార్పునకు సంబంధించిన సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు అధికారికంగా తెలియజేసింది. తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలు, నీటి పంపిణీకి సంబంధించిన కీలక అంశాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు.

ఒడిశాకు తుఫాన్ సూచన.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన వాయిదా

(మొదటి పేజీ తరువాయి)



వాతావరణ సూచనలు, భద్రతా జాగ్రత్తల దృష్ట్యా రాష్ట్రపతి పర్యటనను వాయిదా వేశాం' అని ప్రధాన కార్యదర్శి కార్యాలయానికి చెందిన ఒక అధికారి పేర్కొన్నారు.కాగా, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అక్టోబర్ 28, 29 తేదీల్లో ఒడిశాలోని రైరంగపూర్‌తో పాటు సొంత జిల్లా అయిన మయూర్‌భంజ్‌ను సందర్శించాల్సి ఉన్నది. అయితే మయూర్‌భంజ్ జిల్లా యంత్రాంగం తెలిపిన వివరాల ప్రకారం రాష్ట్రపతి పర్యటన రద్దు కాలేదు. కేవలం తేదీలు మాత్రమే మారాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నవంబర్ 4, 5 తేదీల్లో మయూర్‌భంజ్‌లో పర్యటిస్తారని ఆ అధికారి వివరించారు. మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా బలపడే అవకాశం ఉన్నదని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శనివారం తెలిపింది. అక్టోబర్ 28 ఉదయానికి ఉత్తర ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరాల మధ్య ఎక్కడో ఒకచోట తీరం దాటవచ్చని పేర్కొంది.

కాళేశ్వరంపై బీఆర్ఎస్ నేతలవి హేతుబద్ధత లేని విమర్శలు!

హరీశ్‌రావు సవాలుపై ఘాటు వ్యాఖ్యలు
మరమ్మతులు పూర్తయ్యాకే నీటి పంపింగ్

హైదరాబాద్, అక్టోబరు 24: కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ విషయంలో బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు హేతుబద్ధత లేని విమర్శలు చేస్తున్నారని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మండిపడ్డారు. రాజకీయ దురుద్దేశంతో ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. శనివారం సచివాలయంలో కార్మిక శాఖ మంత్రి జి.వివేక్, ఎమ్మెల్యేలు బీర్ల అయిలయ్య, గ్యాదరి బాలమల్లు, పటోళ్ల సంజీవ్‌రెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.మేడిగడ్డ బ్యారేజీ గేట్లు దించితేనే కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని పంపింగ్ చేయడం సాధ్యమవుతుందని, అయితే ఏడో బ్లాక్ పునరుద్ధరణతోపాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు పూర్తికాకుండా గేట్లు దించలేమని స్పష్టం చేశారు. గేట్లు తెరిచే ఉంచాలని ఎన్‌డీఎస్ఏ సూచన మూడు బ్యారేజీల గేట్లను తెరిచే ఉంచాలని జాతీయ ఆనకట్టల భద్రతా ప్రాధికార సంస్థ (ఎన్‌డీఎస్ఏ) సిఫారసు చేసిందని ఉత్తమ్ తెలిపారు. బ్యారేజీల భద్రతను దృష్టిలో ఉంచుకుని పునరుద్ధరణ పనులు చేపడుతున్నామని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా పనులు నిర్వహిస్తుంటే బీఆర్ఎస్ నేతలు అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు చేసినా ప్రాజెక్టులు పూర్తి కాలేదు బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్ల పాలనలో నీటిపారుదల శాఖపై రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదని ఉత్తమ్ ఆరోపించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలకు బీఆర్ఎస్ పాలనలో తీసుకున్న నిర్ణయాలే కారణమని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ నిర్ణయమే తప్పిదమని వ్యాఖ్యానించారు. ప్రాణహిత--చేవెళ్లతో 16.5 లక్షల ఎకరాలకు నీరు వచ్చేది కాళేశ్వరం ప్రాజెక్టు కోసం ఖర్చు చేసిన నిధుల్లో రూ.38 వేల కోట్లు ప్రాణహిత--చేవెళ్ల ఎత్తిపోతల పథకానికి వినియోగించి ఉంటే, తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం పూర్తయ్యేదని ఉత్తమ్ పేర్కొన్నారు. తద్వారా 16.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉండేదని అన్నారు. కమీషన్ల ప్రయోజనాల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం, కుంగిన ఘటన రెండూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని గుర్తుచేశారు. హరీశ్‌రావు సవాలుపై మంత్రి ఘాటు స్పందన ఆరు నెలలు అవకాశం ఇస్తే కాళేశ్వరం బ్యారేజీలకు మరమ్మతులు చేసి చూపిస్తానంటూ హరీశ్‌రావు చేసిన సవాలుపై ఉత్తమ్ తీవ్రంగా స్పందించారు. గతంలో నీటిపారుదల శాఖ మంత్రిగా హరీశ్‌రావును పదవి నుంచి తొలగించిన విషయాన్ని ప్రస్తావిస్తూ విమర్శలు చేశారు. బ్యారేజీల రూపకల్పన సమయంలో షీట్ పైల్స్ వినియోగించాల్సి ఉండగా, సీకెంట్ పైల్స్ వినియోగానికి అనుమతి ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. ఆ నిర్ణయం వెనుక కారణాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం నిర్ణయాలపై వివేక్ విమర్శలు మంత్రి జి.వివేక్ మాట్లాడుతూ.. ప్రాణహిత--చేవెళ్ల పథకంలో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ఉంటే గురుత్వాకర్షణ శక్తితోనే నీటిని అందించే అవకాశం ఉండేదని అన్నారు. అందుకు భిన్నంగా సుమారు 100 కిలోమీటర్ల దిగువకు వెళ్లి నీటిని పంపింగ్ చేసే విధంగా కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టడం సరైన నిర్ణయం కాదని విమర్శించారు. గత ప్రభుత్వ నిర్ణయాల వల్లే ప్రస్తుత సమస్యలు తలెత్తాయని ఆరోపించారు.



కేంద్ర నిధులపై తెలంగాణ సర్కార్ ఫోకస్: అధికారులకు సీఎస్ సంజయ్ జాజు కీలక ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)

పూర్తిస్థాయిలో వాడుకోవడంపై అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిధుల విడుదలకు అవసరమైన పరిపాలనాపరమైన ప్రక్రియలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శులతో నిరంతరం సమన్వయం సాధించడం ద్వారా నిధుల విడుదలలో ఎదురయ్యే అడ్డంకులను తొలగించుకోవాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. అవసరమైతే ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులతో తానే స్వయంగా చర్చిస్తానని, సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు.రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర పథకాల ద్వారా గరిష్ట ప్రయోజనాలను పొందడమే లక్ష్యంగా ఈ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీనియర్ అధికారులు మహేశ్ దత్ ఎక్కా, దాన కిశోర్, రాహుల్ బొజ్జా, సందీప్ కుమార్ సుల్తానియా, యోగితా రాణా తదితరులు పాల్గొన్నారు.

వస్తోంది తుపాను కాదు.. అతి తీవ్ర తుపాను.. ఏపీకి ఐఎండీ హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరాలకు 'ప్రీ-సైక్లోన్ వాచ్' జారీ

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది. ఇది వేగంగా బలపడుతూ ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తోంది. ఇది రానున్న కొద్ది రోజుల్లో 'అతి తీవ్ర తుపాను'గా మారి రాష్ట్రంపై పెను ప్రభావం చూపనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. అక్టోబర్ 28న బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, యానాం తీర ప్రాంతాలకు 'ప్రీ-సైక్లోన్ వాచ్' జారీ చేసింది.న్యూఢిల్లీలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం శనివారం విడుదల చేసిన ప్రత్యేక బులెటిన్ ప్రకారం.. ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం వాయుగుండంగా మారింది. ఇది ప్రస్తుతం విశాఖపట్నానికి ఆగ్నేయంగా 820 కిలోమీటర్లు, కాకినాడకు 910 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ వాయుగుండం తొలుత దక్షిణ దిశగా కదిలి, అక్టోబర్ 25న తీవ్ర వాయుగుండంగా బలపడనుంది. ఆ తర్వాత దిశ మార్చుకుని పశ్చిమ-వాయవ్య దిక్కుగా ప్రయాణించి మరింత శక్తిని పుంజుకోనుంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ఈ వ్యవస్థ అక్టోబర్ 26 నాటికి తుపానుగా, 27 నాటికి తీవ్ర తుపానుగా, 28వ తేదీ ఉదయం నాటికి అతి తీవ్ర తుపానుగా మారుతుంది. అక్టోబర్ 28వ తేదీన ఉదయం 11:30 గంటల ప్రాంతంలో బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉంది. ఆ సమయంలో గాలి వేగం గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వరకు ఉండవచ్చని, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగానికి చేరవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.తుపాను ఏర్పడటానికి, అది బలపడటానికి సముద్రంలో పరిస్థితులు అత్యంత అనుకూలంగా ఉన్నాయని వాతావరణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 29-30 డిగ్రీల సెల్సియస్ వరకు ఉండటం, మాడెన్-జూలియన్ ఆసిలేషన్ (వీజీం) వంటి వాతావరణ అంశాలు ఈ తుపాను తీవ్రతను పెంచేందుకు దోహదం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక వాతావరణ నమూనాలు (మోడల్స్) కూడా ఈ తుపాను ఏపీ తీరం వైపే వస్తుందని, అతి తీవ్రంగా మారుతుందని ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. కొన్ని నమూనాలు ఒడిశా లేదా తమిళనాడు వైపు సూచించినప్పటికీ, అందుకు అవకాశాలు తక్కువ అని భావిస్తున్నారు.ప్రస్తుత అంచనాల కచ్చితత్వంపై వాతావరణ శాఖ స్పందించింది. తుపాను మార్గం, తీవ్రతపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, సమాచారాన్ని అందిస్తామని తెలిపింది. తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ సూచనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు, సముద్రపు అలల ఉద్ధృతి ఎక్కువగా ఉండే అవకాశం ఉందని హెచ్చరించారు.

'ఇండియా' కూటమి ర్యాలీ వద్దు.. రూ. 10,000 కోట్ల నష్టం వస్తుంది!: రాహుల్ గాంధీకి వ్యాపారుల విజ్ఞప్తి

(మొదటి పేజీ తరువాయి)

కోట్ల మేర వ్యాపార నష్టం వాటిల్లుతుందని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సీటీఐ ఛైర్మన్ బ్రిజేష్ గోయల్ లేఖ రాశారు.పండగ సీజన్‌ను దృష్ట్యాలో ఉంచుకుని నవంబర్ 10 తర్వాత ర్యాలీని నిర్వహించాలని ఆయన ఆ లేఖలో సూచించారు. నవంబర్ 6న ధంతేరస్, నవంబర్ 8న దీపావళి ఉన్న నేపథ్యంలో కొనుగోళ్ల కోసం ప్రజలు భారీగా మార్కెట్లకు వస్తారని, ఈ సమయంలో ర్యాలీ నిర్వహిస్తే వాణిజ్య కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. దీపావళి పండగ వేళ ఢిల్లీ వ్యాప్తంగా బంగారం, వెండి, ఎలక్ట్రానిక్స్, వస్త్రాలు, గృహోపకరణాలు, డ్రై ఫ్రూట్స్, స్వీట్లు, వాహనాలు, స్థిరాస్తి, గిఫ్ట్ ఆర్టికల్స్ వంటి అన్ని రంగాల్లో కలిపి సుమారు రూ.25,000 కోట్ల మేర వ్యాపారం జరుగుతుందని సీటీఐ అంచనా వేసింది.రామ్‌లీలా మైదానానికి ఐదు కిలోమీటర్ల పరిధిలోనే చాందినీ చౌక్, సదర్ బజార్ వంటి సుమారు 20 హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లు ఉన్నాయని, ర్యాలీ కారణంగా విధించే ట్రాఫిక్ ఆంక్షలతో ఈ ప్రాంతమంతా స్తంభించిపోయే ప్రమాదం ఉందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత అక్టోబర్ మాసంలో సెంట్రల్ ఢిల్లీలో జరిగిన పలు ర్యాలీలు, రహదారుల మూసివేత వల్ల ఇప్పటికే వ్యాపారులు రూ.3,000 కోట్ల వరకు నష్టపోయారని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఓటర్ల జాబితా సవరణలో "ఓట్ల చోరీ" జరిగిందన్న ఆరోపణలతో, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'ఇండియా' కూటమి ఈ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. అయితే, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును తాము గౌరవిస్తామని, పండగ సీజన్ ముగిసే వరకు వాణిజ్య ప్రాంతాలకు దూరంగా ర్యాలీలు నిర్వహించాలని సీటీఐ రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేసింది.

సూపర్ ఎల్‌నినో ముప్పు.. నీటిని పొదుపు చేయండి!

(మొదటి పేజీ తరువాయి)

కొరత తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని వెల్లడించారు. సమష్టి కృషితోనే ముప్పును ఎదుర్కోగలం కరోనా సమయంలో ప్రజలంతా సమష్టిగా స్పందించిన విధంగానే, ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే సమస్యలను ఎదుర్కోవడంలోనూ ప్రభుత్వానికి సహకరించాలని డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. నీటి వనరులను నిర్లక్ష్యంగా వినియోగిస్తే భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. నీటిని పొదుపుగా వినియోగించడం ప్రభుత్వంతోపాటు ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌పై అప్రమత్తం సూపర్ ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ వినియోగం మరింత పెరిగే అవకాశం ఉందని భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 2023లో 15,493 మెగావాట్లుగా ఉండగా, 2026 నాటికి 20,018 మెగావాట్లకు చేరిందని వివరించారు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్ శాఖ ముందస్తు ఏర్పాట్లు చేస్తోందని పేర్కొన్నారు. 15 లక్షల పంపుసెట్లకు భూగర్భజలాల కొరత రాష్ట్రంలో మొత్తం 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లు ఉండగా, వాటిలో సుమారు 15 లక్షల పంపుసెట్లకు భూగర్భజలాలు అందుబాటులో లేవని డిప్యూటీ సీఎం తెలిపారు. భూగర్భజలాలు లేని ప్రాంతాల్లో మోటార్లను ఉపయోగించకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ అవసరాలకు నీటిని వినియోగించాలని కోరారు. భవిష్యత్తు అవసరాల కోసం నీటి సంరక్షణ నీటి కొరతను నివారించేందుకు ఇప్పటి నుంచే పొదుపు చర్యలు చేపట్టాలని భట్టి విక్రమార్క సూచించారు. వర్షాలు తగ్గడం, భూగర్భజలాలు పడిపోవడం, విద్యుత్ డిమాండ్ పెరగడం వంటి పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. నీటి వనరులను సంరక్షించి, అందుబాటులో ఉన్న నీటిని అవసరాలకు అనుగుణంగా వినియోగించినప్పుడే భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను తగ్గించగలమని ఆయన పేర్కొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు.. త్వరలో కార్యాచరణ!

సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించే విషయంలో న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నివాసయోగ్యమైన ప్రాంతాల్లో స్థలాలు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఇళ్ల స్థలాల విషయంలో జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రితో పలుమార్లు చర్చలు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పలుమార్లు చర్చించినట్లు పొంగులేటి తెలిపారు. జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి సంబంధించిన అంశాలను సమీక్షిస్తున్నామని చెప్పారు. గతంలో న్యాయపరమైన వివాదాల కారణంగా ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ నిలిచిపోయిందని గుర్తుచేశారు. ఈసారి ఎలాంటి న్యాయపరమైన అడ్డంకులు లేకుండా ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. 2008లో భూ కేటాయింపునకు ఉత్తర్వులు జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి భూముల కేటాయింపునకు సంబంధించి 2008లోనే ఉత్తర్వులు జారీ అయ్యాయని మంత్రి వెల్లడించారు. అయితే, ఈ కేటాయింపులపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు కావడంతో ప్రక్రియ నిలిచిపోయిందని తెలిపారు. దీంతో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించే అంశం చాలా కాలం పాటు పెండింగ్‌లో ఉందని వివరించారు. న్యాయపరమైన అడ్డంకులు తొలగిన తర్వాత ముందడుగు 2022లో న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయని పొంగులేటి పేర్కొన్నారు. అనంతరం 2024 సెప్టెంబర్ 8న జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి భూమిని అప్పగించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ అంశంపై సమీక్ష కొనసాగుతోందని, జర్నలిస్టులకు ప్రయోజనం కలిగేలా తదుపరి చర్యలు చేపడతామని వెల్లడించారు. కేటాయింపులపై కార్యాచరణపై ఆశలు జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించి, వారికి నివాసయోగ్యమైన ప్రాంతాల్లో స్థలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. న్యాయపరమైన వివాదాలు లేకుండా కేటాయింపులు జరిగేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ తాజా ప్రకటనతో ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టుల్లో ఆశలు నెలకొన్నాయి. అయితే, స్థలాల కేటాయింపు ఎప్పటిలోగా పూర్తవుతుంది, అర్హతలు ఏమిటి, తదుపరి కార్యాచరణ ఎలా ఉంటుందనే వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

డ్వాక్రా మహిళలకు ఉద్యోగ అవకాశాలు

భీమదేవరపల్లి, అక్టోబర్ 24 (ప్రజానేస్తం జ్వాల):

డ్వాక్రా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఇంటిగ్రేటెడ్ క్లస్టర్ అప్రోచ్ (ఐఎఫ్‌సీ) ప్రాజెక్టులో భాగంగా జీవనోపాధి సేవా కేంద్రం (ఎల్ఎస్‌సీ) కోఆర్డినేటర్, సీనియర్ క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్‌పీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.అర్హతలు, వేతనాలు: ఎల్ఎస్‌సీ కోఆర్డినేటర్ పోస్టుకు పదో తరగతి లేదా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులు అర్హులు. ఈ పోస్టుకు నెలకు రూ.8 వేల వేతనం చెల్లిస్తారు. సీనియర్ సీఆర్‌పీ పోస్టుకు ఏదైనా డిగ్రీ తప్పనిసరి కాగా, నెలకు రూ.10 వేల వేతనం అందిస్తారు. వ్యవసాయం, పశుసంవర్ధక రంగం, గ్రామీణ జీవనోపాధి కార్యక్రమాల్లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు.దరఖాస్తులకు చివరి తేదీ అక్టోబర్ 29: ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు 2026 అక్టోబర్ 29లోగా భీమదేవరపల్లి మండల సమాఖ్యలో దరఖాస్తులు సమర్పించాలని సంబంధిత అధికారులు సూచించారు. పూర్తి వివరాల కోసం మండల సమాఖ్యను సంప్రదించాలి.



హుజూర్‌నగర్‌లో భూ ఆక్రమణలపై సమగ్ర విచారణ జరపాలి: బీజేపీ

హుజూర్‌నగర్, అక్టోబర్ 24 (ప్రజానేస్తం జ్వాల) :

పట్టణంలో ప్రభుత్వ, దేవాదాయ, సీలింగ్, ఎన్ఎన్‌పీ కాలువ భూముల ఆక్రమణలు, అక్రమ రిజిస్ట్రేషన్లపై బీజేపీ చేసిన పోరాటం ఫలించిందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండ హరీష్ గౌడ్ అన్నారు. ఈ వ్యవహారంలో హుజూర్‌నగర్ ఎమ్మార్వో, ఆర్ఐ, జీపీఓ అధికారుల సస్పెన్షన్ ప్రజా విజయమని పేర్కొన్నారు.హుజూర్‌నగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భూ కబ్జాల కారణంగా పేద ప్రజలకు అన్యాయం జరిగిందని, ఈ అక్రమాలపై బీజేపీ నిరంతరం పోరాటం చేసిందని తెలిపారు. ప్రజల పక్షాన పార్టీ చేసిన ఉద్యమాల ఫలితంగానే ప్రభుత్వం స్పందించి అధికారులపై చర్యలు తీసుకుందని పేర్కొన్నారు.అధికారుల సస్పెన్షన్‌తోనే సమస్య పరిష్కారమైనట్లు భావించబోమని హరీష్ గౌడ్ స్పష్టం చేశారు. పట్టణ పరిధిలో జరిగిన భూ ఆక్రమణలు, అక్రమ రిజిస్ట్రేషన్లపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులందరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్యాయం జరిగిన పేద ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.స్థానిక మంత్రి, అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే ఈ ఆక్రమణలు జరిగాయని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం రానున్న రోజుల్లోనూ బీజేపీ మరింత ఉధృతంగా పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో బీజేపీ జిల్లా నాయకులు బెల్లంకొండ నరేష్ గౌడ్, జిల్లా లీగల్ సెల్ నాయకుడు పిడమర్తి చంద్రయ్య, జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి కంటు నాగరాజు, ప్రధాన కార్యదర్శులు గుండా గోపి, రాళ్లబండి రామారావు, మేళ్లచెరువు లక్ష్మణ్, సోమగాని ప్రదీప్, కొప్పెర సాయిరాం, సతీ బల్వంత్ సింగ్, శ్రవణ్, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వేలేరులో 40 ఇంకుడు గుంతలకు మంజూరు

వేలేరు, అక్టోబర్ 24 (ప్రజానేస్తం జ్వాల):

గ్రామంలో భూగర్భ జలాలను పెంపొందించే లక్ష్యంతో వి.బి.జి. రామ్ జీ పథకం ద్వారా 40 వ్యక్తిగత ఇంకుడు గుంతలకు మంజూరు లభించింది. ఈ పనులను మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వంటగది, బాత్రూమ్ నుంచి వెలువడే వ్యర్థ జలాలు, వర్షపు నీటిని భూమిలోకి ఇంకించేందుకు ఇంకుడు గుంతలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంజూరైన పనులను త్వరలో పూర్తి చేస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకర్, గ్రామపంచాయతీ కార్యదర్శి విజయ, వార్డు సభ్యుడు సునీల్, ఆత్మ డైరెక్టర్ చంద్రమౌళి, సతీష్, సంపత్ రెడ్డి, రాజశేఖర్, శ్రావణ్, తిరుపతి, నరసయ్య, రమేష్, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం ప్రాణదానంతో సమానం: జక్కుల అనిల్ యాదవ్

భీమదేవరపల్లి, అక్టోబర్ 24 (ప్రజానేస్తం జ్వాల):



వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో పోలీస్ సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాజీపేట డివిజన్ పరిధిలోని మడికొండ గార్డెన్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో భీమదేవరపల్లి మండల యువత పాల్గొన్నారు.మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కుల అనిల్ కుమార్ యాదవ్ యువతను సమన్వయం చేసి శిబిరం విజయవంతానికి కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం చేయడం అంటే రక్తం ఇవ్వడం మాత్రమే కాదని, ఒక ప్రాణాన్ని కాపాడటమని అన్నారు.రక్తదానం చేసిన యువతను ఏసీపీ ప్రశాంత్ రెడ్డి అభినందించారు. యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని ముల్కనూర్ ఎస్సై రాజు పిలుపునిచ్చారు.

జోడేఘాట్‌లో 600 మంది పోలీసులతో బందోబస్తు

ఆసిఫాబాద్, అక్టోబర్ 24 (ప్రజానేస్తం జ్వాల):



కొమురం భీమ్ వర్ధంతి సందర్భంగా కెరమెరి మండలం జోడేఘాట్‌లో 600 మంది పోలీసులతో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ నితికా పంత్ తెలిపారు. శనివారం భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్‌పై అధికారులకు సూచనలు చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నామని, వేడుకలకు వచ్చే ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.

కూరగాయల సాగుతో అధిక లాభాలు పొందాలి


నూతనకల్, అక్టోబర్ 24 (ప్రజానేస్తం జ్వాల):

ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న రైతులు ఆరుతడి పంటలైన కూరగాయలు సాగు చేసి అధిక లాభాలు పొందాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉద్యాన పంటల రాయితీలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు.నూతనకల్ మండలం లింగంపల్లి గ్రామంలో రెండు ఎకరాల్లో వంగ, మునగ సాగు చేస్తున్న బోయపల్లి సరోజ వ్యవసాయ క్షేత్రాన్ని కలెక్టర్ సందర్శించారు. పంటల సాగులో లాభనష్టాలు, బిందు సేద్యం పరికరాల పనితీరు, ఎరువుల వినియోగంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నీటి ఎద్దడి పరిస్థితుల్లోనూ కూరగాయలు సాగు చేస్తున్న రైతును అభినందించారు.అనంతరం అలుగునూరు శివారులో సాదు రామకృష్ణారెడ్డి 14 ఎకరాల్లో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను పరిశీలించి సాగు విధానాన్ని తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ సన్యాసయ్య, జిల్లా ఉద్యాన శాఖ అధికారి తీగల నాగయ్య, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, తుంగతుర్తి డివిజన్ ఉద్యాన అధికారి వి. ప్రమిత, మండల వ్యవసాయ అధికారి దివ్య, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు



ఖిలా వరంగల్‌లో నకిలీ సర్టిఫికెట్ బాగోతం!

వరంగల్, అక్టోబర్ 24 (ప్రజానేస్తం జ్వాల):



ఖిలా వరంగల్ పరిధిలో భూముల మ్యుటేషన్ వ్యవహారంలో నకిలీ ధ్రువీకరణ పత్రం ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేయడంతో పాటు ప్రభుత్వ అధికారిక ముద్రను దుర్వినియోగం చేసి, నకిలీ కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం ఆధారంగా భూముల మ్యుటేషన్‌కు ప్రయత్నించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.

రికార్డుల పరిశీలనలో వెలుగులోకి..

కరీమాబాద్ ప్రాంతంలోని భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్న క్రమంలో ఈ వ్యవహారం బయటపడినట్లు సమాచారం. కుటుంబ సభ్యుల వివరాలను ధ్రువీకరిస్తూ జారీ చేసినట్లు చూపిన పత్రంపై తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు, ప్రభుత్వ అధికారిక ముద్రను దుర్వినియోగం చేసినట్లు గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ పత్రాన్ని ఉపయోగించి భూముల మ్యుటేషన్ చేయించుకునేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు

ఈ ఘటనపై సంబంధిత తహసీల్దార్ మిల్స్ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారా? ఈ వ్యవహారంలో ఎవరెవరి ప్రమేయం ఉంది? నకిలీ ధ్రువీకరణ పత్రాన్ని ఎవరు సృష్టించారు? అనే అంశాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.భూముల రికార్డులు, ధ్రువీకరణ పత్రాల నిజానిజాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తే ఈ వ్యవహారంలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

39 సార్లు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచిన హెడ్ కానిస్టేబుల్ సలీం

హనుమకొండ, అక్టోబర్ 24 (ప్రజానేస్తం జ్వాల):



రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడుతూ హెడ్ కానిస్టేబుల్ సలీం ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇప్పటివరకు 39 సార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసి తన సేవాభావాన్ని చాటుకున్న ఆయనను కాజీపేట ఏసీపీ పింగళి ప్రశాంత్ రెడ్డి ఘనంగా సత్కరించారు.పోలీస్ అమరవీరుల సంస్మరణార్థం మడికొండలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ సలీం ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పలుమార్లు రక్తదానం చేస్తూ అత్యవసర సమయాల్లో రోగులకు ప్రాణదాతగా నిలుస్తున్న ఆయన సేవలను అధికారులు అభినందించారు.ఈ సందర్భంగా కాజీపేట ఏసీపీ పింగళి ప్రశాంత్ రెడ్డి సలీంకు పూల మొక్కను అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. రక్తదానం ద్వారా ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని, యువత సామాజిక బాధ్యతగా భావించి స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మడికొండ సీఐ పుల్యాల కిషన్, ఎస్సై రాజాబాబు, ఇతర సీఐలు, ఎస్సైలు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు. 39 సార్లు రక్తదానం చేసిన హెడ్ కానిస్టేబుల్ సలీం సేవలు పోలీసు శాఖతో పాటు సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి.

పోలీస్ అమరవీరుల సంస్మరణార్థం మెగా రక్తదాన శిబిరం

హనుమకొండ, అక్టోబర్ 24 (ప్రజానేస్తం జ్వాల):



పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాల సందర్భంగా మడికొండలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి యువత భారీగా తరలివచ్చారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మడికొండ రాజరాజేశ్వరి గార్డెన్‌లో శనివారం హనుమకొండ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. పోలీస్ అమరవీరులకు నివాళులర్పించడంతో పాటు, ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడాలనే సంకల్పంతో పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

యువతలో రక్తదానంపై అవగాహన

ఈ కార్యక్రమానికి కాజీపేట ఏసీపీ పింగళి ప్రశాంత్ రెడ్డి, రాష్ట్ర రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యుడు శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కాజీపేట డివిజన్ పరిధిలోని తొమ్మిది పోలీస్ స్టేషన్లకు చెందిన ఎస్‌హెచ్‌వోలు, ఎస్సైలతో పాటు ఏడు మండలాల నుంచి వచ్చిన యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. ముఖ్యంగా తలసేమియా బాధితులు, గర్భిణులు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో రక్తం అందించడం ఎంతో కీలకమని వివరించారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ రక్తదాన శిబిరం సేవాభావానికి ప్రతీకగా నిలిచింది. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వరంగల్‌లో రూ.4.83 కోట్ల గంజాయి దహనం

హనుమకొండ, అక్టోబర్ 24 (ప్రజానేస్తం జ్వాల):



మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్న వరంగల్ పోలీసులు 106 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 967.864 కిలోల గంజాయిని శనివారం దహనం చేశారు. దీని విలువ సుమారు రూ.4.83 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు.వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ పర్యవేక్షణలో అమ్మవారిపేట శివారులోని కాకతీయ మెడిక్లీన్ సర్వీసెస్ ఇన్సినరేటర్ ప్లాంట్‌లో నిబంధనల ప్రకారం గంజాయిని ధ్వంసం చేశారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com


ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించిన బీఆర్ఎస్ నాయకుడు సుధీర్



పొనుగోడు: రాష్ట్రంలో రైతులు ఇబ్బందులు పడుతుంటే, నిరుద్యోగులు ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారని రామచంద్రపురం సర్పంచ్ బొలిశెట్టి సుధీర్ విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా సమస్యలను పక్కనపెట్టి ఢిల్లీ పర్యటనలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు.పొనుగోడులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మూడేళ్లుగా జాబ్ క్యాలెండర్ కోసం ఎదురుచూస్తున్న యువతకు నోటిఫికేషన్లు విడుదల కాక నిరాశ ఎదురవుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరిస్తోందని విమర్శించారు.కేసీఆర్ పాలనలో ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేశారని పేర్కొన్నారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మేళ్లచెరువు వెంకటరమణ, మాజీ అధికార ప్రతినిధి రామ్ సైదులు, బిల్లా వెంకటేశ్వర్లు, వార్డు సభ్యుడు అనంతు కరుణాకర్ గౌడ్, నందిపాటి నరహరి, పంగ నాగయ్య, పొలంపల్లి మహా ఆంజనేయులు, నందిపాటి శ్రవణ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో భారీ వర్ష సూచన.. ఈ నెల 27 నుంచి వానలు!

హనుమకొండ, అక్టోబర్ 24 (ప్రజానేస్తం జ్వాల):



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫానుగా బలపడే అవకాశం ఉండటంతో తెలంగాణలో ఈ నెల 27 నుంచి వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. అక్టోబర్ 28న రాష్ట్రంలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ముఖ్యంగా తూర్పు తెలంగాణ జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రైతులు పంటల రక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు వాతావరణ శాఖ తాజా హెచ్చరికలను గమనించాలని సూచించారు. అయితే, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, ఖమ్మం జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

ఎస్సీ, ఎస్టీ బాధితులకు త్వరితగతిన పరిహారం అందించాలి

అధికారులకు అదనపు కలెక్టర్ ఎన్. రవి ఆదేశం

హనుమకొండ, అక్టోబర్ 24 (ప్రజానేస్తం జ్వాల):



ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు ప్రభుత్వ పరిహారం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.జిల్లాలో నమోదైన కేసులు, పెండింగ్ భూ సమస్యలు, పరిహారం చెల్లింపుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు ప్రతి నెలా 30వ తేదీన తప్పనిసరిగా సివిల్ రైట్స్ డే నిర్వహించాలని ఆదేశించారు.

కల్పలత సూపర్ బజార్ అడ్మినిస్ట్రేటర్‌గా ఆర్డీవో వెంకటేష్

హనుమకొండ, అక్టోబర్ 24 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండలోని కల్పలత సూపర్ బజార్ అడ్మినిస్ట్రేటర్‌గా ఆర్డీవో ఎన్. వెంకటేష్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఉత్తర్వులు జారీ చేశారు. సూపర్ బజార్‌లో సుమారు రూ.80 లక్షల నిధుల అవకతవకలు జరిగినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.బాధ్యతలు స్వీకరించిన ఆర్డీవో వెంకటేష్ స్టోర్ ఆర్థిక వ్యవహారాలపై దృష్టి సారించారు. గత కొంతకాలంగా జరిగిన ఆర్థిక లావాదేవీలు, ఆదాయ వ్యయాలు, నిధుల వినియోగానికి సంబంధించిన పూర్తి రికార్డులను విచారణ నిమిత్తం సమర్పించాలని మేనేజింగ్ డైరెక్టర్ సంధ్యారాణిని ఆదేశించారు.పూర్తిస్థాయి విచారణ అనంతరం నిధుల దుర్వినియోగానికి బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

అనుమతులు లేకుండా పటాకులు విక్రయిస్తే కఠిన చర్యలు

హనుమకొండ, అక్టోబర్ 24 (ప్రజానేస్తం జ్వాల):



దీపావళి నేపథ్యంలో ముందస్తు అనుమతులు లేకుండా పటాకులు నిల్వ చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత హెచ్చరించారు. బాణసంచా దుకాణాల నిర్వాహకులు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుంచి లైసెన్స్ పొందాలని స్పష్టం చేశారు.నివాస ప్రాంతాలు, జనసమ్మర్ద ప్రాంతాల్లో అక్రమంగా టపాసులు నిల్వ చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి బాణసంచాను స్వాధీనం చేసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజల భద్రత కోసం వ్యాపారులు, నగరవాసులు పోలీసులకు సహకరించాలని సీపీ కోరారు.

పారిశుద్ధ్య కార్మికురాలు సుశీలకు అధికారుల ఘన నివాళి

భీమదేవరపల్లి, అక్టోబర్ 24 (ప్రజానేస్తం జ్వాల):



గాంధీనగర్ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం శ్రమించిన పారిశుద్ధ్య కార్మికురాలు తూముల సుశీల అకాల మరణం గ్రామంలో విషాదాన్ని నింపింది. ఆమె మృతికి సంతాపం తెలిపిన ఎంపీడీవో వీరేశం, ఎంపీవో నాగరాజ్ స్వగృహానికి చేరుకుని పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రత, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో సుశీల అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆమె మృతి గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కేతిరి లక్ష్మారెడ్డి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది, తోటి కార్మికులు, గ్రామస్తులు పాల్గొని సుశీలకు కన్నీటి నివాళులర్పించారు.

ఈ నెల 26న ప్రజావాణి రద్దు

- **కొమురం భీమ్ వర్ధంతి సందర్భంగా నిర్ణయం.. అర్జీదారులకు కలెక్టర్ హరిత సూచన**

ఆసిఫాబాద్, అక్టోబర్ 24 (ప్రజానేస్తం జ్వాల):



కొమురం భీమ్ వర్ధంతి సందర్భంగా ఈ నెల 26న సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.ప్రజావాణి కార్యక్రమం రద్దు విషయాన్ని ప్రజలు, అర్జీదారులు గమనించి సహకరించాలని కలెక్టర్ కోరారు. తమ సమస్యలపై ఫిర్యాదులు, దరఖాస్తులను మీ సేవ యాప్ ద్వారా సమర్పించుకోవచ్చని సూచించారు.

ముస్తాఫాపూర్‌లో మహిళ అదృశ్యం.. కేసు నమోదు

- **మూడు రోజులుగా లభించని ఆచూకీ.. పోలీసులకు భర్త ఫిర్యాదు**

భీమదేవరపల్లి, అక్టోబర్ 24 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముస్తాఫాపూర్ గ్రామానికి చెందిన శ్రీపతి రజిత (44) అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన రజిత తన భర్త శ్రీపతి సంపత్‌తో కలిసి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తోంది. ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం సుమారు 3.10 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదు. సాయంత్రం వరకు ఎదురుచూసిన కుటుంబ సభ్యులు, బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు.దీంతో రజిత భర్త శ్రీపతి సంపత్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన మహిళ ఆచూకీ కోసం విచారణ కొనసాగిస్తున్నారు.

ఆత్మకూరు మైనర్ బాలిక మృతి కేసులో 24 గంటల్లో నిందితుడి అరెస్ట్

- **ప్రేమ పేరుతో వేధింపుల ఆరోపణలు.. నిందితుడిని రిమాండ్‌కు తరలింపు**
- **కేసు వివరాలు వెల్లడించిన సూర్యాపేట రూరల్ సీఐ జి. రాజశేఖర్**

సూర్యాపేట, అక్టోబర్ 24 (ప్రజానేస్తం జ్వాల):



ఆత్మకూరు (ఎస్) పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలిక మృతి కేసులో పోలీసులు వేగంగా స్పందించారు. కేసు నమోదైన 24 గంటల్లోనే నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. రాజశేఖర్ వెల్లడించారు.పోలీసుల వివరాల ప్రకారం.. ప్రేమ పేరుతో మైనర్ బాలికను వేధింపులకు గురిచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వేధింపులు భరించలేక బాలిక ఈ నెల 22వ తేదీ రాత్రి మృతిచెందినట్లు కేసు నమోదైంది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడిని గుర్తించారు.ఈ క్రమంలో మాన్య తండా, ఏపూర్ తండాకు చెందిన వాంకుడోతు నరేశ్‌ను అక్టోబర్ 24న అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఆయన కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.ఈ కేసు దర్యాప్తు, నిందితుడి అరెస్ట్ ప్రక్రియలో ఆత్మకూరు (ఎస్) ఎస్ఐతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మహిళలు, బాలికల భద్రతకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, వేధింపులకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

ఈ సమస్య ఉన్నా సరైన తిండి తింటే బరువు తగ్గడం పెద్ద కష్టమేం కాదట

పీసీఓఎస్ ఒకసారి వచ్చిన తర్వాత చాలా కాలం పాటు సమస్యలు కలిగిస్తుంది. ఇది మహిళల్లో హార్మోన్ల అసమతుల్యత వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా బరువు పెరగడం చాలా సాధారణం. కొంతమంది మాత్రం బరువు తగ్గలేమనుకుంటారు. దీర్ఘకాలంగా వాపు ఉండడం వల్ల బరువు పెరగడం జరుగుతుంది. దీన్ని తగ్గించేందుకు మెడిటెరేనియన్ డైట్ ఉపయోగపడుతుంది. ఇందులో పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ఆలివ్ నూనె వంటివి ఉండాలి. అలాగే ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉండే చేపలను ఆహారంలో చేర్చటం శరీరానికి మేలు చేస్తుంది. కొవ్వులంటే బరువు పెరుగుతుందనే భయం చాలా మందిలో ఉంటుంది. కానీ మంచి కొవ్వులు శరీరానికి మేలు చేస్తాయి. అవకాడో, ఆలివ్ నూనె, నట్స్, కొబ్బరి నూనె వంటివి తినడం వల్ల ఆకలిని తగ్గించవచ్చు. దీని వలన బరువు తగ్గడం సులభమవుతుంది. కేవలం క్యాలరీలు తగ్గిస్తే సరిపోదు. ప్రాసెస్ చేసిన ఆహారాలు, జంక్ ఫుడ్ నుంచి దూరంగా ఉండాలి. గుడ్లు, పాలు, మాంసం, చేపలు లాంటి ప్రోటీన్ ఉన్న ఆహారం తినడం వల్ల ఎక్కువ సేపు ఆకలేయదు. ప్రతివారం కనీసం మూడు రోజులు బరువులెత్తే వ్యాయామాలు చేయడం వల్ల నడుము చుట్టూ ఉన్న కొవ్వు కరిగిపోతుంది. పూర్తి నిద్ర, ఒత్తిడి తగ్గించే యోగా, ధ్యానం చేయడం వల్ల కూడా బరువు తగ్గడంలో సహాయం చేస్తాయి.

నల్లగొండ జిల్లాలో కాలువలో గుర్తుతెలియని మృతదేహం

వేములపల్లి, అక్టోబర్ 24 (ప్రజానేస్తం జ్వాల):



నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలెం కాలువలో గుర్తుతెలియని మృతదేహం కొట్టుకొస్తుండటాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసేందుకు చర్యలు చేపట్టారు.కాలువలో మృతదేహాన్ని చూసిన స్థానికులు ఆందోళనకు గురయ్యారు. కొందరు ఈ దృశ్యాలను మొబైల్ ఫోన్లలో చిత్రీకరించగా, ఆ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.మృతుడి వివరాలు, మరణానికి గల కారణాలను తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతికి ప్రమాదమా, ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణాల్లో విచారణ జరుపుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గ్రేటర్ వరంగల్ సిటీ ప్లానర్‌గా రవీంద్ర రెడేకర్



వరంగల్, అక్టోబర్ 24 (ప్రజానేస్తం జ్వాల):

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (GWMC) సిటీ ప్లానర్‌గా రవీంద్ర రెడేకర్ నియమితులయ్యారు. జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన అనంతరం ఆయనకు ఈ పోస్టింగ్ ఇచ్చారు. నగర ప్రణాళికతో పాటు పట్టణాభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ, అభివృద్ధి పనుల ప్రణాళిక రూపకల్పన వంటి బాధ్యతలను ఆయన నిర్వహించనున్నారు. గతంలో ఆయన వరంగల్‌లో ఇన్‌చార్జి సిటీ ప్లానర్‌గా విధులు నిర్వహించారు.

రెండేళ్లుగా ప్రారంభానికి నోచుకోని బీసీ బాలికల వసతి గృహం

ఆసిఫాబాద్, అక్టోబర్ 24 (ప్రజానేస్తం జ్వాల):

ఆసిఫాబాద్‌లో కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన బీసీ బాలికల కళాశాల వసతి గృహ భవనం రెండేళ్లు గడిచినా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో భవనం నిరుపయోగంగా మారిందని, రాత్రి వేళల్లో మద్యం సేవించే వారికి అడ్డాగా మారుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి వసతి గృహాన్ని ప్రారంభించి విద్యార్థినులకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

అటవీ సరిహద్దు వివాదాలు పరిష్కరించి.. భూముల రీ సర్వే వేగవంతం చేయాలి

- రెవెన్యూ, అటవీ శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయి పర్యవేక్షణ
- రైతులకు ముందస్తు సమాచారం ఇచ్చాకే రీ సర్వే చేపట్టాలి: భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేశ్ కుమార్



సూర్యాపేట, అక్టోబర్ 24 (ప్రజానేస్తం జ్వాల):

అటవీ సరిహద్దు వివాదాలను పరిష్కరించి, భూముల రీ సర్వే పనులను వేగవంతం చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో సర్వే పనులను పర్యవేక్షించాలని సూచించారు. శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భూముల రీ సర్వే పురోగతి, సర్వే బృందాల ఏర్పాటు, అటవీ సరిహద్దు వివాదాలు తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సమావేశానికి సూర్యాపేట సమీకృత కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ కుమార్ మాట్లాడుతూ.. రీ సర్వే పనులు సక్రమంగా సాగేందుకు అవసరమైన బృందాలను ఏర్పాటు చేసి, పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. అటవీ సరిహద్దు వివాదాలను సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రైతులకు ముందస్తు సమాచారం తప్పనిసరి

రీ సర్వే నిర్వహించే ముందు సంబంధిత రైతులకు ముందస్తుగా సమాచారం అందించాలని కమిషనర్ సూచించారు. ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న రైతులకు సైతం వారి భూముల్లో సర్వే నిర్వహించే తేదీలను ముందుగానే తెలియజేసి, వారు సర్వే ప్రక్రియలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. సర్వే సమయంలో క్షేత్రస్థాయి రిజిస్టర్లను తప్పనిసరిగా నిర్వహిస్తూ, వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని స్పష్టం చేశారు.

రీ సర్వేకు ప్రత్యేక పోర్టల్

రీ సర్వే పనులకు అవసరమైన అదనపు రోవర్ పరికరాలను ప్రభుత్వం తగిన సంఖ్యలో సమకూర్చనున్నట్లు లోకేశ్ కుమార్ తెలిపారు. భూ భారతి తరహాలో రీ సర్వే కోసం ప్రత్యేకంగా కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. సిబ్బంది, పరికరాలను సమర్థంగా వినియోగించుకుంటూ సర్వే పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్వో ప్రేమ్ రాజ్, సర్వే, భూ రికార్డుల శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వర్షపు ప్రతి చుక్కను ఒడిసిపట్టాలి

- తాగునీటి సమస్య పరిష్కారానికి వారంలో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి
- ఇంకుడు గుంతలు, సోక్‌పిట్లు, భూగర్భ జలాల పెంపునకు ఉపాధి పనులు
- గ్రామంలోనే ఉపాధి కల్పించి వలసలకు అడ్డుకట్ట వేయాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట, అక్టోబర్ 24 (ప్రజానేస్తం జ్వాల):

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాతో పాటు స్థానిక నీటి వనరులను గుర్తించి, వార్డు వారీగా తాగునీటి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. వారం రోజుల్లో ప్రణాళిక సిద్ధం చేసి గ్రామసభలో ప్రజలకు వివరించాలని స్పష్టం చేశారు. శనివారం ఆత్మకూరు (ఎస్) మండలంలోని మిడ్తనపల్లి గ్రామంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పనులు, భూగర్భ జలాల పెంపు, గ్రామీణ ఉపాధి తదితర అంశాలపై అధికారులు, గ్రామస్థులతో కలెక్టర్ చర్చించారు.

వారంలో తాగునీటి కార్యాచరణ ప్రణాళిక

గ్రామంలో ప్రస్తుతం మూడు బోర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతోందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. భూగర్భ జలాలు మరింత తగ్గే ప్రమాదం ఉన్నందున నీటి వనరుల లభ్యతను అంచనా వేయాలని కలెక్టర్ సూచించారు. బోర్ల నుంచి నేరుగా పైపులైన్లకు నీటిని సరఫరా చేస్తున్న నేపథ్యంలో అవసరమైన శుద్ధి చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి వార్డు, కాలనీ, గేరీ వారీగా నీటి సరఫరా పరిస్థితిని పరిశీలించి, ఎక్కడ నీరు అందుతోంది.. ఎక్కడ సమస్యలు ఉన్నాయనే వివరాలను సేకరించాలని ఆదేశించారు. ప్రధాన నీటి వనరు పనిచేయని పరిస్థితుల్లో ప్రత్యామ్నాయంగా నీటిని ఎక్కడి నుంచి సరఫరా చేయవచ్చో ముందుగానే గుర్తించాలని సూచించారు. స్థానిక నీటి వనరులతో పాటు ఫ్లషింగ్ బోర్లను కూడా పరిశీలించాలని తెలిపారు. గ్రామంలోని ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్ (ఓహెచ్ఎస్ఆర్) ట్యాంకుల వద్దకు వెళ్లేందుకు మెట్లు లేవన్న విషయంపై స్పందిస్తూ, అవసరమైన పనులకు అంచనాలు సిద్ధం చేసి ఉపాధి పథకం లేదా ఇతర నిధుల ద్వారా చేపట్టే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

ప్రతి నీటి చుక్క భూమిలోకి ఇంకేలా చర్యలు

వర్షపు నీటిని ఒడిసిపట్టడంతో పాటు భూగర్భ జలాల పెంపునకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించి, వర్షపు నీటితో పాటు గృహ అవసరాలకు వినియోగించిన నీటిని కూడా భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మురుగు కాల్వల వద్ద డ్రైనేజీ సోక్‌పిట్లు, రోడ్లకు ఇరువైపులా సోకేజ్ ఛానళ్లు నిర్మించాలని తెలిపారు. రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాల్లో కమ్యూనిటీ సోక్‌పిట్లు ఏర్పాటు చేయడం ద్వారా పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని వివరించారు. తాగునీటి బోర్ల వద్ద భూగర్భ జలాల పునరుద్ధరణకు రీచార్జ్ నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

రైతులకు ప్రయోజనం చేకూరేలా పనులు

వ్యవసాయ బోర్ల వద్ద కూడా నీటి పునరుద్ధరణ నిర్మాణాలను చేపట్టి రైతులకు ప్రయోజనం చేకూర్చాలని కలెక్టర్ తెలిపారు. ఉద్యాన పంటలు, పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులకు ప్రభుత్వ పథకాల ద్వారా అందే సహాయాన్ని వివరించి, అర్హులను గుర్తించాలని సూచించారు.

గ్రామంలోనే ఉపాధి.. వలసలకు అడ్డుకట్ట

వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయ పనులు తగ్గే అవకాశం ఉన్నందున గ్రామీణ కూలీలకు స్థానికంగానే ఉపాధి కల్పించేలా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి కుటుంబానికి 125 రోజుల ఉపాధి కల్పించే లక్ష్యంతో వీబీ-జీ రామ్ జీ కార్యక్రమం కింద పనులను గుర్తించాలని సమావేశంలో వివరించారు. నీటి సంరక్షణ, ఇంకుడు గుంతలు, సోక్‌పిట్లు, బోర్ల రీచార్జ్ నిర్మాణాలు వంటి పనుల ద్వారా కూలీలకు ఆదాయం కల్పించడంతో పాటు గ్రామానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. రైతులకు ఉపయోగపడే పనులను గుర్తించి, వివిధ శాఖల సమన్వయంతో కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. గ్రామంలోనే ఉపాధి లభించేలా చర్యలు తీసుకోవడం ద్వారా వలసలను తగ్గించి, ప్రజలకు మెరుగైన జీవన పరిస్థితులు కల్పించాలని అధికారులకు సూచించారు.

పనుల అమలులో ప్రజల భాగస్వామ్యం

ఉపాధి పథకం కింద చేపట్టే పనుల్లో ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, అవసరమైన చోట సోకేజ్ ఛానల్, డ్రైనేజీ సోక్‌పిట్, తాగునీటి వనరుల పునరుద్ధరణ పనులు ఉన్నాయా లేదా పరిశీలించాలని తెలిపారు. గ్రామపంచాయతీ అధికారులు, గ్రామస్థులు కలిసి పనుల అమలును పర్యవేక్షించాలని, ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరేలా పనులను గుర్తించి పురోగతిని సమీక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, జిల్లా పరిషత్ సీఈవో శిరీష, డీఆర్‌డీవో సన్యాసయ, డీఏఓ శ్రీధర్ రెడ్డి, తహశీల్దార్ అనిల్ సింగ్, ఎంపీడీవో సత్యనారాయణ రెడ్డి, వైద్యాధికారి రమ్య, వ్యవసాయ శాఖ అధికారులు, విద్యుత్ శాఖ ప్రతినిధులు, ఏపీవో, ఏపీఎం తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అతడితో మాట్లాడడం ఆపేశాక బరువు పెరిగాను: జాన్వీ కపూర్ సరదా వ్యాఖ్యలు

బాలీవుడ్ ప్రముఖ టాక్ షో 'కాఫీ విత్ కరణ్' కొత్త సీజన్ ఆసక్తికరంగా సాగుతోంది. సల్మాన్ ఖాన్, విజయ్ దేవరకొండ, రష్మిక మందన తర్వాత ఇప్పుడు మూడో ఎపిసోడ్‌కు బాలీవుడ్ నటులు వరుణ్ ధావన్, జాన్వీ కపూర్ ముఖ్య అతిథులుగా రాబోతున్నారు. శనివారం విడుదలైన ఈ ఎపిసోడ్ టీజర్, షోపై అంచనాలను పెంచుతోంది. ఇందులో వరుణ్, జాన్వీ ఇద్దరూ హోస్ట్ కరణ్ జోహార్‌పై చేసిన ఫన్నీ కామెంట్స్ హైలైట్‌గా నిలిచాయి. టీజర్ ప్రకారం, ఒకానొక సమయంలో కరణ్ జోహార్ తమ ఇద్దరితో మాట్లాడటం పూర్తిగా ఆపేశారని వరుణ్, జాన్వీ వెల్లడించారు. "మీ ఇద్దరి వల్ల నేను చాలా హర్ట్ అయ్యాను," అని కరణ్ చెప్పగా, జాన్వీ కపూర్ కలుగజేసుకొని, "మీరు మాతో మాట్లాడటం ఆపేశాక నేను బరువు కూడా పెరిగాను" అని సరదాగా వ్యాఖ్యానించారు. దీనికి వరుణ్ ధావన్ స్పందిస్తూ, "కరణ్, మీరు చాలా డ్రామాటిక్‌గా ప్రవర్తించారు. అప్పుడు మీరు 'కభీ ఖుషీ కభీ గమ్'లోని బచ్చన్‌లా మారిపోయి 'నేను పెద్దవాడిని, అది నా హక్కు' అన్నట్టు వ్యవహరించారు" అంటూ కరణ్‌ను ఆటపట్టించారు. అయితే కరణ్ వారిపై ఎందుకు అలకబూనాడనే పూర్తి కారణం తెలియకపోయినా, ప్రస్తుతం వారి మధ్య అంతా సవ్యంగానే ఉన్నట్లు కనిపిస్తోంది. ఈ ఎపిసోడ్‌లో మరో స్పెషల్ అట్రాక్షన్‌గా రాపిడ్ ఫైర్ రౌండ్‌లో నటుడు అర్జున్ కపూర్ కూడా జాయిన్ అయ్యారు. కెరీర్, పెళ్లికి సంబంధించిన సలహాలు ఎవరి నుంచి తీసుకుంటావని కరణ్ అడగ్గా, వరుణ్ వెంటనే అర్జున్ కపూర్ పేరు చెప్పాడు. అలాగే, ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ఏదని జాన్వీని అడగ్గా, ఆమె భోజ్‌పురి నటుడు రవి కిషన్ పేరు చెప్పారు. అంతేకాకుండా, ఆయన వైరల్ పంచ్‌లైన్ 'మనీ ఫోలోస్ మై బ్రదర్!'ను ఇమిటేట్ చేసి నవ్వించారు. ఈ టీజర్‌ను తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన కరణ్ జోహార్, "వరుణ్, జాన్వీ నా కౌచ్‌పై ఉన్నారు. ఇంతకంటే ఇంకేం చెప్పాలి? ఈ ఎపిసోడ్ మొత్తం పిచ్చెక్కించేలా ఉంటుంది. ఒక ప్రత్యేక అతిథి కూడా ఉన్నారు" అని క్యాప్షన్ ఇచ్చారు. 'కాఫీ విత్ కరణ్' సీజన్ 9, మూడో ఎపిసోడ్ బుధవారం సాయంత్రం 7 గంటలకు జియోహాట్‌స్టార్‌లోని పీకాక్ హబ్‌లో ప్రసారం కానుంది.



ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

- విద్యార్థులతో ముచ్చటించి.. పాఠ్యాంశాలపై ప్రశ్నలు
- నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు కల్పించాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట, అక్టోబర్ 24 (ప్రజానేస్తం జ్వాల):



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు పక్కాగా అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆత్మకూరు (ఎస్) మండలం మిడ్తనపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్, ప్రైమరీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లోకి వెళ్లిన కలెక్టర్ విద్యార్థులతో నేరుగా ముచ్చటించారు. పాఠ్యాంశాలపై పలు ప్రశ్నలు అడిగి, విద్యార్థుల సందేహాలను ఓపికగా నివృత్తి చేశారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

మధ్యాహ్న భోజన నాణ్యతపై ఆరా

అనంతరం పాఠశాల వంటగదిని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, పారిశుద్ధ్య ప్రమాణాలపై ఆరా తీశారు. మెనూ ప్రకారం పరిశుభ్రమైన, పౌష్టికాహారాన్ని మాత్రమే విద్యార్థులకు అందించాలని, వంటకాల తయారీలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని నిర్వాహకులకు స్పష్టం చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లు, ఇతర రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

పాఠశాలలో ఏవైనా మౌలిక వసతుల సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి విశాల్, తహసీల్దార్ హమీన్ సింగ్, ఎంఈఓ ధారాసింగ్, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్‌లో చుట్టుముట్టి తాకారు: నటి అనుపమ పరమేశ్వరన్ ఆవేదన

ఎయిర్‌పోర్ట్‌లో తనకు ఎదురైన ఓ చేదు అనుభవాన్ని పంచుకున్న అనుపమ

లగేజీ కోసం చూస్తుండగా చుట్టుముట్టి, అనుమతి లేకుండా ఫొటోలు తీశారని వెల్లడి

కొందరు తనను తాకడంతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యానని ఆవేదన

ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ తనకు ఎయిర్‌పోర్ట్‌లో ఎదురైన ఓ చేదు అనుభవాన్ని తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పంచుకున్నారు. కొందరు వ్యక్తులు తనను చుట్టుముట్టి, అనుమతి లేకుండా ఫొటోలు తీయడమే కాకుండా అసభ్యంగా తాకారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను మానసికంగా ఎంతో ఇబ్బంది పెట్టిందని తెలిపారు. వివరాల్లోకి వెళ్తే, ఇటీవల ఓ ఎయిర్‌పోర్ట్‌లో లగేజీ కోసం ఒంటరిగా వేచి చూస్తున్న సమయంలో కొందరు తన వద్దకు వచ్చారని అనుపమ చెప్పారు. మొదట మాట్లాడేందుకు ప్రయత్నించి, ఆ తర్వాత తన అనుమతి లేకుండానే ఫొటోలు తీయడం మొదలుపెట్టారని వివరించారు. క్షణాల్లో జనం తనను చుట్టుముట్టారని, ఫొటోలు తీస్తూ తనను తాకారని, ఆ సమయంలో ఏం చేయాలో పాలుపోలేదని ఆమె పేర్కొన్నారు. అభిమానులతో ఫొటోలు దిగడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని అనుపమ స్పష్టం చేశారు. అయితే, కొందరు ప్రవర్తించే తీరు, హద్దులు మీరడం ఆందోళన కలిగిస్తుందన్నారు. ఇలాంటి సమయాల్లో ఎవరు ఎలా ప్రవర్తిస్తారో, ఎక్కడ తాకుతారో తెలియక భయమేస్తుందని ఆమె అన్నారు. నటీనటుల వృత్తి జీవితంలో అభిమానులతో ఫొటోలు దిగడం సాధారణమే అయినా, కచ్చితంగా కొన్ని హద్దులు పాటించాలని సూచించారు. సమాజంలో సాధారణ మహిళలు కూడా ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి ధైర్యాన్ని మెచ్చుకోవాలని అనుపమ పేర్కొన్నారు.

